ఎస్ఎన్‌డీపీ పనులను వేగవంతం చేయాలి

- **జిల్లా కలెక్టర్ శశాంక**

రంగారెడ్డి, జూన్ 12(నమస్తే తెలంగాణ) : ఎస్ఎన్‌డీపీ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ప్రతీమా సింగ్‌తో కలిసి రాష్ట్ర స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ (ఎస్ఎన్‌డీపీ) పనుల వేగవంతంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మీర్‌పేట్, బడంగ్‌పేట్, జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నాలా ప్రాజెక్టు కింద జరుగుతున్న కాలువల పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రణాళికలు తయారు చేసి వాటి వివరాలు అందజేయాలన్నారు. మున్సిపాల్టీల పరిధిలోని నాలా పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటే స్థానికులకు ముంపు సమస్య ఉండదని, ప్రాణ నష్టం వంటివి వాటిల్లకుండా ఉంటుందన్నారు. ప్రమాదాలను నివారించడానికి సైట్ల వెంట హెచ్చరిక బోర్డులు, మొబైల్, మినీ మొబైల్ స్టాక్ టీంలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షాలు కురిసినా, పనులకు అంతరాయం కలగకుండా కొనసాగించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సమావేశంలో కందుకూరు ఆర్డీవో సూరజ్ కుమార్, మీర్‌పేట్, బడంగ్ పేట్, జల్ పల్లి మున్సిపల్ కమిషనర్లు, ఎమ్మార్వోలు, రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

మంచాల, జూన్ 12 : మండల పరిధిలోని ఆగాపల్లి అలిచెరువును కబ్జాచేసిన సిరివెంచర్స్ యజమానులపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అలీచెరువు పక్కనే ఉన్న వెంచర్స్ యాజమాన్యం అనేక చెరువుల్లో శిఖం భూమిలోపల రోడ్లువేసి కబ్జాచేశారని ఆరోపించారు. వెంటనే అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు నరసింహ, పాపయ్య, నాగరాజు, పరమేష్, దానయ్య, రమేశ్, కుమార్, దుర్గయ్య పాల్గొన్నారు.

విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

రికార్డులను పరిశీలిస్తున్న ఏవో శ్రీలత

కడ్తాల్, జూన్ 12 : విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రం తోపాటు రావిచేడ్ గ్రామంలోని విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలు విక్రయించినప్పుడు తప్పనిసరిగా రసీదులు అందించాలని తెలిపారు. నకిలీ విత్తనాలను అమ్మి రైతులను మోసగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలని సూచించారు. దుకాణాల్లో అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలని, ధరల పట్టికతోపాటు ఎరువుల నిల్వలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో వందన, డీలర్లు జితేందర్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, నరేందర్ పాల్గొన్నారు.

అరకొర వసతులు.. అవస్థల్లో విద్యార్థులు

- **పాఠశాలలు ప్రారంభమైనా సమస్యల వలయంలో విద్యార్థులు**
- **అమ్మ ఆదర్శ పాఠశాలల్లో 75 శాతం పనులు అసంపూర్తి**
- **చాలీచాలని నిధులతో తిప్పలు**

మొయినాబాద్, జూన్ 12 : పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారుస్తామని ప్రభుత్వం మన ఊరు-మన బడి అనే పేరును మార్చి అమ్మ ఆదర్శ పాఠశాలలుగా నామకరణం చేసింది. పేరు మార్చడంలో ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ సౌకర్యాలు కల్పించడంలో లేదని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. అన్ని పాఠశాలల్లో 75 శాతం పనులు పూర్తి కావాల్సి ఉంది. బుధవారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. ప్రభుత్వం చేసిన ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో ప్రభుత్వం పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలకు పొంతన లేకుండా పోయింది. నిధులు సరిగా రాకపోవడంతో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను చేయడానికి కాంట్రాక్టర్లు కూడా పెద్దగా ఆసక్తి చూపడం లేదన్న చర్చ జరుగుతుంది.

అస్తవ్యస్తంగా మరుగు దొడ్లు

ప్రభుత్వం పాఠశాలల్లో మరుగు దొడ్లు విద్యార్థులకు అత్యవసరంగా కల్పించాల్సిన మౌలిక సదుపాయం.కానీ ప్రభుత్వ అసమర్థతో మరుగుదొడ్లు దుర్వాసనను వెదజల్లుతున్నాయి. కొన్ని చోట్ల డోర్లు కూడా సరిగా లేని పరిస్థితి నెలకొంది. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల మరమ్మత్తులు పనులు పూర్తి కాలేదు. మరుగు దొడ్లల్లో కొత్తగా కుండీలు, టైల్స్ వేయడం, మంచినీటి సౌకర్యం కల్పించడం వంటి పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. చాకలిగూడ గ్రామంలో మరుగుదొడ్లను ఎత్తులే పడంతో పాటు మరుగుదొడ్లలో ఉపయోగించే నీరు బయటకు వెళ్లడానికి ఎలాంటి మార్గం లేదు. దీంతో వృథా నీళ్లు ఒక చోటకు వెళ్లడానికి సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం కోసం గుంతను తవ్వే వద్దనే పనులు కొనసాగుతున్నాయి. సజ్జన్‌పల్లిలో మరుగుదొడ్డి అధ్వానంగా తయారైంది. అప్పారెడ్డిగూడ గ్రామంలో టైల్స్ వేయాల్సి ఉండగా వాటిని వేయలేదు.

చేవెళ్లటౌన్ : పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

మొయినాబాద్ :అప్పారెడ్డిగూడ ప్రభుత్వ పాఠశాలలో డోర్లు లేక అస్తవ్యస్తంగా ఉన్న మరుగు దొడ్లు

ఎలక్ట్రిసిటీ పనులు మాత్రమే..

ఎన్నికల బూత్‌లను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు విద్యుత్ అవసరం కనుక వాటికి సంబంధించన పనులను మాత్రమే చేశారు. సీలింగ్ ఫ్యాన్‌లు బిగించారు. మిగతా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. నిధులు కూడా సరిపోకపోవడంతో పనులను పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లు ఆలోచించాల్సిన దుస్థితి ఉంది.

నిధులు సరిపోవడం లేదు
-శివకుమార్,కాంట్రాక్టర్

ఎన్నికలకు ముందు పాఠశాలల్లో కరెంట్ పనులు చేశాం. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు సరిపోవడం లేదు. ప్రస్తుతం మాత్రం మరుగు దొడ్ల మరమ్మతులు, మంచినీటి సౌకర్యం కల్పించే విధంగా ఏర్పాటు చేయాలని ఇప్పటి వరకు కేవలం రూ.25 వేలు మాత్రమే ఇచ్చారు. మరుగుదొడ్లు చాలా అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఈ పనులు అన్ని చేయడానికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సరిపోవు. అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపుతున్నామని అధికారులు చెబుతున్నారు.

నిలిచిన నీరు.. అపరిశుభ్రంగా మూత్రశాలలు

చేవెళ్లటౌన్ :మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. పాఠశాల ఆవరణలో కలుపు మొక్కలు పెద్ద ఎత్తున పెరిగాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలకు వెళ్లాలంటే విద్యార్థులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంది. వర్షం నీరు గుండాని తలపిస్తుంది. తాగు నీటి ట్యాంక్‌ను కూడా శుభ్రం చేయలేదు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

పుస్తకాలు, యునిఫామ్స్ కూడా అంతంతే

కొత్తూరు : విద్యా సంవత్సరం ప్రారంభమైన వేళ సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పెంజర్ల, సిద్దాపూర్, ఇన్ముల్‌నర్వ, కొత్తూరు జడ్పీహెస్ఎస్ పాఠశాలల్లో సరైన వసతులు లేకుండానే విద్యా సంవత్సరం ప్రారంభమైంది. యూనిఫామ్స్ కుట్టడానికి కాంట్రాక్ట్ ఏజెన్సీలకు ఇవ్వడంతో సరైన సమయానికి అందివ్వలేదు. స్టిచ్చింగ్ సరిగ్గా లేదని ఉపాధ్యాయులు కూడా ఒప్పుకుంటున్నారు. పుస్తకాలు కూడా మొత్తం విద్యార్థులకు రాలేదు. ఇక పాఠశాలలో స్కావెంజర్ లేక మూత్ర శాలలు కూడా శుభ్రపరిచే పరిస్థితి లేదు.

స్తంభం విరిగింది... చీకటి కమ్మింది

పెద్దఅంబర్‌పేట : మున్సిపాలిటీ పరిధి పసుమాములలోని ప్రాథమిక పాఠశాలలో ఇటీవల భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు స్తంభం విరిగిపోయింది. చెట్టు కొమ్మలు సైతం విద్యుత్ తీగలపై పడి తెగిపోయాయి. ఇది జరిగి దాదాపు నాలుగురోజులు దాటింది. అయినా మరమ్మతులు కాకపోవడంతో ఉపాధ్యాయులు ఆరు బయట అడ్మిషన్ ప్రక్రియను కొనసాగించారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఎమ్మెల్సీగా నవీన్‌రెడ్డి గెలుపొందిన సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నోముల పద్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం నవీన్‌రెడ్డిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, ఎంపీటీసీ కట్న లత, మాజీ సర్పంచ్‌లు గొవిందు, నర్సింహులు, బండి రాజు పాల్గొన్నారు.– **–నందిగామ, జూన్ 12**

కుక్కల దాడిలో 30 గొర్రెలు మృత్యువాత

ఇబ్రహీంపట్నం, జూన్ 12 : గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేయడంతో 30 జీవాలు మృతి చెందాయి. ఈ ఘటన ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం బైపాస్ రోడ్డులో ఉన్న మీర్ హుస్సేన్ గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేశాయి. 30 గొర్రెలు మృత్యువాత పడటంతో బాధితుడు బోరుమన్నాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు. గొర్రెల మందను 2వ వార్డు కౌన్సిలర్ భాను పరిశీలించి ఎమ్మెల్యేకు విషయాన్ని తెలియజేశారు.

మొక్కల పరిశీలన

పెద్దఅంబర్‌పేట, జూన్ 12: హరితహారం మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకుంటునట్లు మున్సిపాలిటీ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ అన్నారు. తట్టిఅన్నారం- పెద్ద అంబర్‌పేట రేడియల్ రోడ్డు లో నాటిన మొక్కల చుట్టూ కలుపును సి బ్బందితో తొలగింపజేశారు. చెత్తాచెదారాలను శుభ్రం చేశారు. మొక్కలకు సరైన రీతిలో నీటిని పోయించి, మొక్కల పెరుగుదల కు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలోని పలు నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నామని, వర్షాలు జోరందుకోగానే మొక్కలు నాటేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం, జూన్ 12 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏసీపీ కేవీపీ రాజు అన్నారు. గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం డ్రగ్‌పై యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత పట్టుదలతో లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కొంతమంది చెడు వ్యసనాలకు అలవాటు పడి తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారని అన్నారు. కొంతమంది యువత డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు బానిసలవుతూ..తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ గగన్‌దీప్‌సింగ్ కోహ్లీ, మేనేజింగ్ డైరెక్టర్ సైనీ, సీఐ ఆంజనేయులు, ఎస్ఐ మైబెల్లి, మారయ్య పాల్గొన్నారు.

అనాథ వృద్ధ మహిళకు అంత్యక్రియలు

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 12 : మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసం ఉంటున్న ఒంటరి వృద్ధురాలు మేతరి శోభ అంత్యక్రియలను సురక్ష సేవా సంఘం ప్రతినిధులు నిర్వహించారు. ఇంటి పక్కనే ఉండే రామకృష్ణ పంతులు కుటుంబం ఏదైనా అవసరం ఉంటే వృద్ధురాలిని చూసుకునేవారు. వారం రోజులుగా ఆమె మంచానికే పరిమితమయ్యారు. మంగళవారం రాత్రి మృతి చెందింది. ఆమెకు ఎవ్వరూ లేకపోవడంతో ఈ విషయాన్ని సురక్ష సేవా సంఘానికి చేరవేశారు. సంఘం సభ్యుల నుంచి విరాళాలు సేకరించి అంత్యక్రియలకు అన్ని ఏర్పాట్లు చేసి ముందునడిచి తలకొరివి పెట్టి అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కెర గోపి శంకర్‌యాదవ్, కార్యదర్శి కస్తూరి రమేశ్, సభ్యులు మహేశ్, యాకూబ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- **కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**
- **ప్రారంభమైన పాఠశాలలు**
- **పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేత**
- **పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు**

ఆమనగల్లు : యూనిఫారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పక్కన జడ్పీటీసీ అనురాధ, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి. మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్

ఆమనగల్లు, జూన్ 12 : ప్రభుత్వ పాఠశాలల్లోనే శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే ఉత్తమ బోధన జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల ఇన్‌చార్జి ఎంఈవో సర్ధార్ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు కూడా స్వంత భవనం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నేనావత్ అనురాధ, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వసంత, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, ఎంపీటీసీ దోనాదుల కుమార్, కౌన్సిలర్ చెన్నకేశవులు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడ్తాల్ : వేసవి సెలవులు ముగియడంతో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థుల హాజరు శాతం నామమాత్రంగానే ఉంది. గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి బడీడు పిల్లను బడిలో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

నందిగామ : మండలంలోని చేగూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను ఎంపీపీ ప్రియాంక అందజేశారు. మండల వ్యాప్తంగా పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు పంపిణీ

చేవెళ్ల రూరల్ : విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో బడి గంటలు మోగాయి. చేవెళ్ల మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు పునర్ ప్రారంభమయ్యాయి. పలు పాఠశాలల్లో ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందజేశారు. ఊరెళ్ల ప్రభుత్వ పాఠశాలలో వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, అంతారం జడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎం రామారావు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యునిఫాం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఉమ్మెంతల మాణెమ్మ, ఉపాధ్యాయులు పరిగి మల్లేశ్ కుమార్, హతిరాం, మాణిక్యరావు, నర్సింహులు, రేష్మ, సతిత, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మోగిన బడి గంట

షాద్‌నగర్‌టౌన్ : షాద్‌నగర్‌లో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. పలు పాఠశాలల వద్ద తమ చిన్నారులను బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రుల హడావిడి కనిపించింది. వేసవి సెలవుల అనంతరం విద్యార్థుల రాకతో పాఠశాలలు సందడిగా మారాయి. ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ప్రారంభంకావడంతో విద్యార్థులు ఉదయానే బడిబాట పట్టారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరూ సహకరించాలని కోరారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేత

ఇబ్రహీంపట్నం బృందం : పాఠశాలలు బుధవారం నుంచి పునప్రారంభం కావటంతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు హాజరైన విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంతో పాటు పాఠ్యపుస్తకాలు అందజేశారు. మొదటిరోజు కావటంతో పలు పాఠశాలల వద్ద స్వాగత తోరణాలు సైతం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా అన్ని పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ కూడా అందజేశారు. ఆయా పాఠశాలల్లో పలువురు ప్రజాప్రతినిధులు తమ సొంత ఖర్చులతో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, జామెట్రీ బాక్సులు అందజేశారు.

చేవెళ్లటౌన్ : ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో అక్బర్, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండారి శైలజ, హెచ్ఎం ఖాజా పాష, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం అన్నారు. పాఠశాల పునః ప్రారంభం సందర్భంగా చిలుకూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మంచి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తారని, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంధ్య, హెచ్ఎం నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

షాబాద్ : విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని హైతాబాద్, సర్దార్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎంపీడీవో అపర్ణ, మండల నోడల్ ఆఫీసర్ లక్ష్మణ్, పాఠశాల హెచ్ఎం వసంతతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. మండల స్థాయిలో అత్యధిక జీపీఐ 9.3 సాధించిన విద్యార్థులు స్వాతి, శ్రీతికలను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వనిత, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సుదర్శన్, మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింహులు, ఉపాధ్యాయులు సుదర్శన్, గోవింద్, సుశీల, మాధవి, సైనీ, మురళి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మున్సిపల్ చైర్పర్సన్ లావణ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీహెచ్‌లో విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అంగూర్‌నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవేందర్‌యాదవ్, కౌన్సిలర్ మాదారం నర్సింహాగౌడ్, బ్యాగరి యాదయ్య, గోపాల్‌గౌడ్, పీఈటీ సాగర్, ఉపాధ్యాయుడు భానుప్రకాశ్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో పాఠశాలకు హాజరవుతున్న విద్యార్థులు

చేవెళ్లరూరల్ : ఊరెళ్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందజేసిన వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్

మంచాల మండలం బోడకొండలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న జడ్పీటీసీ మర్రి నిత్య

షాద్‌నగర్‌టౌన్ : జిల్లా పరిషత్ కుంట ఉన్నత పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

మంచాల : కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మంచాల, , జూన్ 12 : నిరుపేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి వరంలాంటిదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంచాల మండలానికి చెందిన 20 మంది లబ్ధిదారులకు తన క్యాంపు కార్యాలయంలో బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావు, నాయకులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, కావలి శ్రీనివాస్, జయానందం, హనుమంత్‌రెడ్డి, రాంరెడ్డి, చీమల జంగయ్య, రమాకాంత్‌రెడ్డి, వాజీద్, అంతటి రాజు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంరూరల్: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఉప్పరిగూడ, పోచారం గ్రామాల్లో సుమారు రూ.5.50కోట్లతో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం ఐటీ పారిశ్రామిక రంగ సంస్థల ఏర్పాటుకు కృషి చేస్తోందని వివరించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫాం, పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం : అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన మెడికల్ కిట్లను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు మెడికల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం పంపిణీ చేసిన మెడికల్ కిట్లను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల బాలికల పట్ల అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వారికి పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాలుగా కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి పద్మజరమణ, సీడీపీ శాంతిశ్రీ, సూపర్‌వైజర్‌లు తులసి, పల్లవి, సరళ, కల్పన, సత్తమ్మ, అరుణ పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యాచారం, జూన్ 12: డొనేషన్ల పేరు తో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలపై అధికారులు చర్య లు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షుడు కంబాలపల్లి విప్లవ్‌కుమా ర్ అన్నారు. మండలంలో అధిక ఫీజు లు వసూళ్లు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల విద్యాధికారికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో పుస్తకాలు, యూనిఫాం విక్రయించి దందా చేస్తున్నారని ఆరోపించారు. అనుమతి లేకుండానే అడ్మిషన్లు తీసుకుంటున్నారన్నారు. గుర్తింపులేని పాఠశాలపై చర్యలు తీసుకొని మూసివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జంగయ్య, శ్రీకాంత్ ప